

# అమాయకుడు

ఒకప్పుడు అమరావతి నగర సమీపంలో కామందకుడనే వ్యాపారి ఉండేవాడు. అతని కొడుకు పేరు సుబుద్ధి. కానీ అతనికి ఏ కోశానా చదువు వొంటబట్టలేదు. కనీసం వ్యాపార లక్షణాలు కూడా అతనిలో లేవు. కొడుకును తలచుకొని తండ్రి ఎంతో విచారిస్తూ ఉండేవాడు.

ఏదో ఒక విధంగా కొడుకును ప్రయోజకుణ్ని చేద్దామన్న అభిప్రాయంతో కామందకుడు ఒక రోజున కొడుకును పిలిచి, అతనికొక గుర్రాన్ని ఇచ్చాడు. కొద్ది రోజుల్లో ధాన్యకటకంలో సంత జరగబోతున్నది. ఏదో ఓ ధరకు ఈ గుర్రాన్ని అమ్ముకురమ్మని కామందకుడు చెప్పాడు.

ఆ మరునాడే సుబుద్ధి గుర్రాన్ని ఎక్కి ధాన్యకటకం బయలుదేరాడు. అతనికి గుర్రపు స్వారీ చేతకాదు. అదీగాక, ఆ గుర్రం స్వారీచేసేది కూడా కాదు. ధాన్యకటకం చేరేలోపుగా అది చాలా సార్లు అతన్ని కింద పడవేసింది. అతని చేతులూ, కాళ్ళూ, దెబ్బలతో వాచిపోయాయి. గుర్రం మీద సుబుద్ధికి కోపం వచ్చింది.

అతను ఆ సంతలో ఆ గుర్రాన్ని గురించి ఉన్నదున్నట్టుగా చెప్పాడు.

"మహాజనులారా! ఈ గుర్రం ఎలా పొగరుమోతుది! మనుషుల్ని దగ్గరికు రానివ్వదు. రానిచ్చినా తిన్నగా ఎక్కనివ్వదు. ఏదో తంటాలు పడి గుర్రం ఎక్కినా అది సరిగ్గ నడవదు. నేను మా ఊరినుండి, ఇక్కడికొచ్చేలోగా కనీసం పది సార్లయినా, నన్ను కింద పడవేసి ఉంటుంది. కావాలంటే, నాకు తగిలిన దెబ్బలను చూసుకో వచ్చు. ఈ గుర్రాన్ని నేను అమ్మబోతున్నాను. కావలసినవారు పాడుకోవచ్చు" అంటూ అరవసాగాడు సుబుద్ధి.

అతని ధోరణ చూసి అందరూ నవ్వుకొన్నారే గానీ, గుర్రాన్ని కొనడానికి ఎవ్వరూ ముందుకు రాలేదు. ఈలోగా అతనికో బేరగాడు తటస్థపడ్డాడు. సుబుద్ధిని చూస్తూనే అతనికేమీ రాదని అతగాడు గ్రహించాడు. ఆ గుర్రాన్ని తను లాభసాటిగా అమ్మతాననీ, అందుకు గాను, లాభంలో కొంతభాగం తనకూ ఇవ్వమనీ అడిగాడు అతను. సుబుద్ధి అందుకు ఒప్పుకున్నాడు.

"అయ్యలారా!" అంటూ ప్రారంభించాడు బేరగాడు. "ఈ గుర్రాన్ని అరేబియా నుండి తెప్పించాం. అరేబియా సుల్తానుగారు దీన్ని ఉపయోగిస్తూ ఉండేవారు. ఇది వాయువేగ మనోవేగాలతో పరుగెత్తుతుంది. అనేక పరుగు పందాలలో గెలిచింది. యజమాని మనస్సును ఇట్టే గ్రహించి అందుకు అనుగుణంగా నడుచుకొంటుంది. ఇలాంటి ఉత్తమ అశ్వాన్ని కొనే అదృష్టవంతుడెవ్వరో ముందుకు రావాలని నా కోరిక" అన్నాడు బేరగాడు.

సుబుద్ధి బేరగాడి దగ్గరకెళ్ళి ఇలా అన్నాడు—

"బాబూ! ఇన్ని మంచి గుణాలున్న గుర్రాన్ని అమ్మడం నాకూ ఇష్టం లేదు దీన్ని అమ్మబోవడం లేదు" అంటూ, గుర్రాన్ని తీసుకొని, తిరిగి ఇంటి ముఖం పట్టాడు.

—౦—